# సహాయాత్ర

పరిచయాలన్నీ స్నేహాలు కావు. స్నేహాలన్నీ అర్థవంతమూకావు. స్నేహితులందరూ ఆత్మీయులూ కాలేరు. షబ్బీర్‌తో నా పరిచయం ఇంత స్నేహంగా, అర్థవంతంగా మారుతుందని ముందు నేను ఏమాత్రం ఊహించలేదు.



మా అబ్బాయి శేఖర్ జహీరాబాద్‌లో యఫ్.సి.ఐ ఉద్యోగి. అక్కడే బ్యాంకు లోను మీద ఇల్లొకటి కట్టుకుని గృహప్రవేశానికి పది రోజులముందే రమ్మని ఉత్తరం రాశాడు. నేనూ, నా భార్య వెళ్లాం. పది రోజులని వెళ్లిన వాళ్లం కొడుకు, కోడలు బలవంతంమీద ఆరు నెలల వుండిపోయాం.

క్యాష్ విత్‌డ్రాల్ కోసం బ్యాంకుకు నన్నే పురమాయించేవాడు. మొదటిసారి మేనేజర్‌కు నన్ను పరిచయం చేశాడు. వాళ్లిద్దరూ స్నేహితులు కావటంవలన నేను విత్‌డ్రాల్ తీసుకుని నేరుగా మేనేజర్ ఛాంబర్‌లోకి వెళ్లేవాణ్ణి. కౌంటర్ల చుట్టూ తిరిగే పనిలేకుండానే డబ్బు నా చేతికొచ్చేది. అతను బిజీగా లేకుంటే కాసేపు కబుర్లతో కాలక్షేపం చేసేవాణ్ణి. అలాంటి సందర్భంలోనే షబ్బీర్‌తో పరిచయం అయింది.

తెల్లని పైజామా, లాల్చీలో చేతికర్ర సాయంతో ఛాంబర్‌లోకి అడుగుపెడ్తున్న ఆ వృద్ధుణ్ణి చూస్తూనే మేనేజర్ సీటు నుండి లేచి సగౌరవంగా ఆహ్వానించాడు.

అయిదున్నర అడుగుల ఎత్తు, మంచి రంగు, కోలముఖం, పొయ్యి ఆకారంలో బట్టతలమీద నెరిసిన తెల్లజుట్టు, పీచుగడ్డం, దళసరి అద్దాల కళ్లజోడుతో ఆయనను చూస్తూనే నాకు సదభిప్రాయం కలిగింది. నా పక్క కుర్చీలో మెల్లగా కూర్చున్నారు.

"మీట్ మిస్టర్ షబ్బీర్, సీనియర్ సిటిజన్ ఆఫ్ ది టౌన్' అంటూ ఆయన గురించి నాకు, "మీట్ మిస్టర్ శ్రీనివాసరావు, రిటైర్డ్ టీచర్. రెసిడెంట్ ఆఫ్ గుంటూరు, వీరి అబ్బాయి ఉద్యోగరీత్యా ఇక్కడే వుంటున్నారు" అంటూ నా గురించి ఆయనకు పరిచయం చేశారు.

పరస్పర అభివాదాలయ్యాయి.

షబ్బీర్ ఒకప్పటి హైదరాబాద్ సంస్థానంలోనే ఉద్యోగని, భారత ప్రభుత్వంలో ఆ సంస్థానం విలీనం అయ్యాక రెవిన్యూ శాఖలో ఉద్యోగిగా కొనసాగి పదవీ విరమణ చేశారని, గత ముప్పై ఏళ్లుగా ఆయన ప్రభుత్వ పెన్షనర్ అనీ, నెలనెలా పెన్షన్ బ్యాంకుకే నేరుగా వస్తుందనీ తెలిసింది.

నేను మనస్సులో లెక్కలేసి, "అయితే మీ వయస్సు సుమారు తొంభై వుండొచ్చను కుంటాను" అన్నాను.

"అంతే పండిట్‌జీ! యువకులుగా వున్నపుడు అనుకుంటాం మనిషికి ఇంత తక్కువ జీవితకాలం ఏమిటని, కాని ఇంత వయస్సు వచ్చీ బతకాల్సి వస్తే మాత్రం వార్ధక్యం చాల భారంగా తోస్తుంది సుమా!" అంటూ నవ్వేరాయన.

అప్పుడు ప్రసంగవశాత్తు నేను చెప్పిన ఒక సూక్తి ఆయనను బాగా ఆకట్టుకుంది.

"జీవితం ఉల్లిపాయలాంటిది. ఒక్కోపొర వలిచేసుకుంటూ పోతే చివరకు మిగిలేది ఏదీ ఉండదు, దాని ఘాటు తాలూకు కన్నీళ్లు తప్ప".

ఆ మాటలకు షబ్బీర్, "బహుత్ అచ్ఛీ బాత్, బహుత్ అచ్ఛా" అంటూ ప్రశంసించారు.

'మీరు బాగా పుస్తకాలు చదువుతారా?"

"ఆ! ఒకప్పటికన్నా, రిటైరయిన ఏడేళ్లబట్టీ ఆ పుస్తకమే నా సహచరుడనుకోండి" చెప్పాను.

మేనేజర్ తెప్పించిన టీలు తాగుతూ కొద్దిసేపు ముచ్చట్లలో మునిగాం. వచ్చిన పనయింది. మరికాసేపు వుండటం మేనేజర్ పనికి ఆటంకమవుతుందని బయటకు నడిచాం.

ఆయన కోసం స్కూటర్‌తో బయట ఒక నూనూగు మీసాల కుర్రవాడు సిద్ధంగా వున్నాడు.

"నా మనవడు, నా షికార్లకు తోడు వీడే. మా తండ్రి పేరు పెట్టాం, జబ్బార్ అని" చెప్పారు ఆ యువకుణ్ణి చూపి.

"సలాం వాలేఖుం" అన్నాడు ఆ కుర్రవాడు అభివాదం చేస్తూ.

"మీరెంతకాలం వుంటారు?" అడిగాడాయన.

"ఈ భూమ్మీద నూకలు వున్నంతకాలం" అన్నాను చిరునవ్వుతో.

"ఆప్ క్యా బోల్ రహేహై?" అన్నారు నా మాటలకర్థం వెంటనే స్ఫురించక.

"నూకలు వున్నంతకాలం, అంటే ఆయుష్షు వున్నదాకా" చెప్పాను వివరిస్తూ.

అర్థమైనట్లుగా నవ్వి, "ఆఫ్ బహుత్ ఖూబ్ బోల్తేహై! నా ఉద్దేశం ఈ ఊళ్లో మీరు ఎంతకాలం వుంటారని..." అడిగేరు.

"పది రోజులనే వచ్చాం. కాని కొద్ది నెలలుండొచ్చు"చెప్పాను.

"ఇద్దరికీ కాలక్షేపంగా వుంటుంది. ఇక్కడ వున్నంత కాలం మా ఇంటికి తరచూ వచ్చి నా ఆతిథ్యం స్వీకరించండి" అంటూ సాదరంగా ఆహ్వానించి చిరునామా చెప్పేరు.

అందుకు నేను సంతోషంగా అంగీకరించాను.

"ఆప్‌కేలియే, మై ఇంతిజార్ కరూంగా" అంటూ కరచాలనం చేసి సెలవు తీసుకున్నారు.

* * *

షబ్బీర్‌గారిల్లు కనుక్కోవటం నాకేమాత్రం కష్టం అనిపించలేదు. ఆయన పేరు చెప్తూనే నలుగురూ నా పట్ల చూపిన మర్యాదను బట్టే ఆ ఊరిలో ఎంతటి పరువు ప్రతిష్టలున్నాయో బోధపడింది.

నేను వెళ్లేసరికి ఆయన వాలు కుర్చీలో పడుకుని పుస్తకం చదువుతున్నారు. నన్ను చూస్తూనే ఆయన ముఖం ఆనందంతో వికసించింది.

"అయియే సాబ్! అయియే! మీ రాక నాకెంతో సంతోషం కలిగిస్తుంది" ఆదరంగా చేయందించి తన ప్రక్కనున్న కుర్చీలో కూర్చోబెట్టారు.

అప్పటివరకు చదువుతూ టీపాయి మీదుంచిన పుస్తకం నా దృష్టిలో పడింది. అది భగవద్గీత. "మీరు భగవద్గీత చదువుతారా?" ప్రశ్నించాను.

"ఏం పండిట్‌జీ! మీ హిందువులే చదవాలని వుందా? చదువు జ్ఞానం ఇస్తే మతం ధర్మ మార్గాన్ని చెప్తుంది. సర్వమత సారాన్ని గ్రహించటానికి ప్రయత్నించటం తప్పుకాదుగా. ఈ మధ్యనే తెప్పించాను. చదివి అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నాను" చెప్పాడాయన.

"రామాయణ, భారత కథలు కూడా చదివారా?"

"చదవలేదు. కాని టీ.వీలో వస్తున్నప్పుడు శ్రద్ధగా చూశాను. మీరు ఇంకా వివరంగా చెప్తానంటే వినేందుకు అభ్యంతరం లేదు" చెప్పారు.

ఆయన వుంటున్నది ఒక పాతకాలపు భవనం. తాతగారి హయాంలో కట్టించబడిందట. విశాలమైన ప్రాంగణంలో గాలీ, వెలుతురుకీ లోటు లేకుండా ఇంకా పటిష్టంగానే కనిపిస్తుంది. మొత్తంమీద పద్దెనిమిది గదులున్నాయి.

కాసేపటికి సల్వార్ కమీజ్ వేసుకున్న ఒక యువతి ట్రేలో టీ తీసుకు వచ్చింది.

"నా మనవరాలు, ముంతాజ్. నాకు అవసరమైనవన్నీ టైం ప్రకారం జరిగేలా శ్రద్ధగా చూస్తుంటుంది" ప్రేమగా ఆ యువతి తల నిమురుతూ చెప్పేరు.

నలుగురు అన్నదమ్ముల్లో తనొక్కడే బ్రతికున్నది. ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లు. కొడుకు చనిపోయి ఐదేళ్లయింది. ఆడపిల్లలిద్దరూ ఆదిలాబాద్ జిల్లాలో వుంటున్నారు. మనవళ్లు ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో వుంటూ అక్కడే స్థిరపడ్డారు. ఇక్కడ వుంటున్నది అన్న కొడుకులిద్దరూ, తమ్ముని కొడుకులు ఇద్దరూ. మొత్తం నాలుగు కుటుంబాలు ఈ ఇంట్లోనే వుంటున్నారు. తమ్ముడు కొడుకు సలీం డాక్టర్. మిగతా వాళ్లంతా రకరకాల వ్యాపారాల్లో బాగానే ఆర్జిస్తున్నారు.

కబుర్లతో కాలం ఇట్టే గడిచిపోయింది. రాత్రి ఎనిమిది గంటలవుతుండగా జబ్బార్ వచ్చాడు. నేను వద్దంటున్నా వినకుండా ఇంటివద్ద దించిరమ్మని మనవడికి పురమాయించారు.

* * *

పరిచయమైన కొత్తలో షబ్బీర్ ఇంటికి రెండు మూడు రోజులకు ఒకసారి వెళ్తుండేవాడినల్లా రోజూ సాయంత్రం ఐదు గంటలకల్లా వెళ్లసాగేను. తిరిగి బయల్దేరే సమయానికి జబ్బార్ వస్తే అతనుగానీ, హాస్పిటల్ నుండొస్తే డాక్టర్ సలీంగాని కారులో డ్రాప్ చేసేవారు. వద్దన్నా వినేవారు కాదు.

ఇంటిముందు లాన్‌లో కుర్చీలు వేయించుకుని కూర్చునేవాళ్లం. ఒకరోజు కబుర్లు చెప్పుకుంటూ కొద్దిదూరం నడిచేవాళ్లం. మేం కలిసి గడిపే నాలుగైదు గంటల కాలం గిర్రున తిరిగి పోతున్నట్లుండేది.

రెండు మూడుసార్లు టీలు వచ్చేవి. పకోడీ, పుణుకుల్లాంటి వేడివేడి కారపు పదార్థాలు ఏదోటి రోజూ మా కోసం తయారు చేసి పెట్టేవారు.

"పండిట్‌జీ! మీరు స్వీట్స్ తినరని ఈ కారం వస్తువులు చేయిస్తున్నాను. మా వాళ్లకు ఇవి వండటం అంతగా చేతకాదు. ఎలా వున్నాయి?" ఆప్యాయంగా అడిగేవారు.

"భేషుగ్గా వుంటున్నాయి. మా వాళ్లు కూడా ఇంతకుమించి గొప్పగా ఏం వండలేరులెండి" చెప్పేవాడిని నవ్వుతూ.

నైజాం నవాబు సంస్థానం గురించి, అప్పటి ఫ్యూడల్ వ్యవస్థ గురించి, నిజాం నిరంకుశ పరిపాలనకు, రజాకార్లకు-వ్యతిరేకంగా జరిగిన తెలంగాణా పోరాటం గురించి ఎన్నో విషయాలు ఆయన ఆసక్తిగా కథల్లా చెప్పేవారు.

తను నైజాం సంస్థానంలో ఉద్యోగిగా చేరినప్పుడు నెల జీతం పది రూపాయిలు. చిన్న ఉద్యోగుల జీతాలు స్థాయినిబట్టి అరవైకి మించి వుండేవికావు. ఆ జీతాలు చాలకనే అవినీతికి పాల్పడి అమాయక ప్రజల్నుండి డబ్బు దోచుకునేవారు. ఉన్నత ప్రభుత్వాధికారులు మాత్రం భోగాలు అనుభవించేవారు. పదిహేను వందలమంది జీతభత్యాలకుగాను యేడాదికి ఐదు కోట్ల రూపాయిలు ఖర్చయ్యేది.

హైదరాబాద్ సంస్థానం వ్యవసాయం కింద ఐదు కోట్ల ముప్పై లక్షల ఎకరాల భూమి వుండేది. దాదాపు పది శాతం భూమి నైజాం స్వంత కమతంగా వుండేది. ఏటా దానిమీద వచ్చే ఆదాయంలో రెండు కోట్లు కుటుంబానికి, పరివారానికి అయ్యే ఖర్చులకు వాడబడేది.

పైగాలు, దేశముఖులు, జాగిర్దార్లు, భూస్వాములు సామాన్య ప్రజలను దోపిడీ చేసేవారు. పటేల్, పట్వారీ, మాలీపటేల్ వంటి గ్రామాధికారులు కూడా ప్రజల్ని నానా రకాలుగా పీడించుకు తినేవారు.

తెలంగాణా అంతటా వెట్టి విధానం వుండేది. చేతివృత్తుల వారు తాము తయారు చేసే వస్తువుల్ని భూస్వాములకు ఉచితంగా అందించాలి. గ్రామాలకొచ్చే అధికారులకు వ్యాపారస్థులు ఉచితంగా సౌకర్యాలు కల్పించాలి. పేదప్రజలు భూస్వాముల, అధికారుల విందు వినోదాలకు గొర్రెలు, కోడిపెట్టలు ఉచితంగానే ఇవ్వాలి. భూస్వాములు తమ కుమార్తెలకు పెళ్లిచేసి అత్తవారింటికి పంపేటప్పుడు కూడా ఒక బానిస బాలికను పనికోసం అప్పగించేవారు. భూస్వాములు ఆ బాలికలను ఉంపుడుకత్తెలుగా వుంచుకునేవారు.

ఇలా గంటల తరబడి ఆ కాలపు చారిత్రక విషయాలను షబ్బీర్ సాకల్యంగా చెప్పుకు పోతుండేవారు.

* * *

రామాయణ, భారత కథల్లోని కొన్ని ముఖ్య ఘట్టాలను శ్రద్ధగా అడిగి చెప్పించుకున్నారు. షబ్బీర్ మనవరాలు ముంతాజ్ ఆ కథలంటే చెవికోసుకునేది. రోజూ కాసేపు ఆ అమ్మాయి కోసమైనా లోకాభిరామాయణం కట్టిపెట్టి పురాణ కథలు చెప్పవలసి వచ్చేది.

పంచతంత్ర కథలు షబ్బీర్‌కు ఎంతగానో నచ్చాయి. పదేపదే చెప్పించుకునేవారు. ముఖ్యంగా మూడు చేపల కథ ఆయనను బాగా ఆకట్టుకుంది. మానవనైజాన్ని జంతువుల ద్వారా చిత్రిస్తూ, నీతి బోధకంగా చెప్పబడిన గొప్ప కథలని మెచ్చుకున్నారు.

ఖురాన్ గురించి నాకేం తెలియదని, చదవాలని వుందనీ చెప్తే, 'ది గ్లోరీ ఆఫ్ ఖురాన్-ఎ-షరీఫ్' అరబిక్-ఇంగ్లీషులో ఉన్న ఖురాన్ కొని తెప్పించి నాకు బహూకరించారు. అందులో చెప్పబడిన ఎన్నో విషయాలను తరచూ నాకు వివరించి చెప్పేవారు.

"తాను ఏది కోరునో ఇతరులకు అదే కోరవలెను" అన్న మహమ్మద్ ప్రవక్త సూక్తిని చెప్పి ఇస్లాంపట్ల గౌరవంవున్న ముస్లింలందరూ ఆచరించాలనేవారు.

"పండిట్‌జీ! మతాభిమానం వుండొచ్చు. కాని మత దురభిమానం మాత్రం ప్రమాదకరమైంది. దేశంలో అశాంతికి, అభివృద్ధి నిరోధానికి కారణం దురభిమానమే. పూజామందిరాల పరిధి దాటి మతం బయటకు రావటానికి కారణం స్వార్థపరులైన రాజకీయ నాయకులు. మతం అనేది మనిషికి మానసికంగానే అనుసంధానించబడాలి. వ్యక్తిగతంగా అతనికి శాంతిని ఇవ్వగలగాలి" మతంపట్ల తన అభిప్రాయం నిక్కచ్చిగా చెప్పారు.

ఈ మూడు నెలల మా సాన్నిహిత్యంలో నేను ఆ ఇంట్లో అందరికీ పరిచయస్తుణ్ణి అయ్యాను. నా పట్ల అందరూ ఎంతో గౌరవమర్యాదలతో మెలగేవారు. డాక్టర్ సలీం నా అభ్యంతరాన్ని పట్టించుకోకుండా అప్పుడప్పుడు కారులో ఇంటివద్ద దించేవాడు.

"పండిట్‌జీ! మేం మీకు కృతజ్ఞులమై వుండాలి. గత కొద్ది నెలలుగా చాచా ఎంతో హుషారుగా, సంతోషంగా వుంటున్నారు. అందుకు కారణం మీ స్నేహం. ఈ బిజీలైఫ్‌లో ఆయన కోసం మేం తగినంత సమయం కేటాయించలేం" విచారంగా అన్నాడు సలీం.

"బాల్యంలో అతిగా పట్టించుకోవటం అనేది పిల్లలకు చిరాకు కలిగిస్తుంది. వృద్ధాప్యంలో పట్టించుకోనట్లనిపించటం వృద్ధులను బాధపెడ్తుంది" చెప్పాను మెల్లగా.

"నిజమే! డబ్బు గురించి మాకు లోటులేదు. తరాల అంతరం, పెద్దరికం చాచాని మాకు తగినంత సన్నిహితం చెయ్యలేకపోయాయి. ఆయన మానాన ఆయన్నొదిలేశామన్న బాధ లేకుండా చేశారు" సంతోషం వ్యక్తపరిచాడు.

"సలీంజీ! ధనం ఆహారాన్నిస్తుందిగాని ఆకలినివ్వదు, మందులనిస్తుందిగాని ఆరోగ్యాన్నివ్వదు, పరిచయాలనిస్తుందిగాని స్నేహితులనివ్వదు, సేవకులనిస్తుందిగాని విశ్వాసాన్నివ్వదు, సంతోషపు దినాలనిస్తుందిగాని శాంతినివ్వదు" ఇబ్సన్ సూక్తి ఉటంకించాను.

"చాచా మిమ్మల్నెందుకు లైక్ చేస్తారో నాకు అర్థం అవుతుంది" నవ్వుతూ ఇంటి ముందు కారాపాడు సలీం.

షబ్బీర్‌ని మా ఇంటికి ఒకసారి రమ్మని అనేకసార్లు ఆహ్వానించాను. అయితే ఆ అవకాశం ఇవ్వకుండా నేనే వాళ్లింటికి రోజూ వెళ్తున్నప్పుడు ఆయనెలా వస్తారు?

నాకు జ్వరం తగిలి వరుసగా రెండు రోజులు వెళ్లలేకపోయాను. అందుకు నా మనస్సు గిజగిజలాడుతూనే వుంది. మూడోరోజు జబ్బార్‌ని తీసుకుని వెతుక్కుంటూ నా కోసం రానే వచ్చారు!

"మిమ్మల్ని మా ఇంటికి రప్పించుకునే ఉపాయం తెల్సింది. ఇక చూడండి వారానికి రెండు రోజులన్నా జ్వరపడతాను" అన్నాను నవ్వుతూ.

"ఈ ముసలివాణ్ణి అలా ఇబ్బంది పెట్టాలనుకుంటే మీ ఇష్టం. మీరిలా ఊళ్లోవుండే రెండ్రోజులు రాకుంటే మాత్రం ప్రాణం పోతున్నా మీ కోసం లేచి రాక తప్పేటట్టు లేదు" అన్నారు చేతులు పట్టుకుని కదిలిస్తూ.

నాపట్ల ఆయన చూపుతున్న అభిమానం నన్ను విచలితుణ్ణి చేసింది. అన్నిటికన్నా విలువైనది స్నేహమని అందుకే అంటారు కాబోలనుకున్నాను.

ఇంట్లో అందర్నీ ఆయనకు పరిచయం చేశాను. అర్థగంటలో రెండు రకాల తినుబండారాలు ఆయన కోసం నా భార్యా, కోడలు తయారుచేశారు. అవి చూస్తూనే ఆయన నొచ్చుకున్నారు.

"అయ్యో! ఎంత శ్రమ పడ్డారమ్మా! నేను రంజాన్ ఉపవాసాలుంటున్నాను. పచ్చి మంచినీళ్లు కూడా ముట్టకూడదు. మాఫ్‌కీజియే!" అంటూ వున్నంతసేపు బాధపడ్డారు.

షబ్బీర్ – రంజాన్ రోజు ఏకంగా సలీంతో ప్రత్యక్షమైనారు. రకరకాల పిండివంటలు ప్రత్యేకంగా తయారుచేయించి తీసుకొచ్చారు.

"పండిట్‌జీ! మిమ్మల్ని ఈ రోజు మా అతిథిగా పిలుద్దామంటే మీరు శాకాహారులాయె. మా తృప్తికోసం మీరు స్వీకరించాలి" అంటూ అభ్యర్థించారు.

"ప్రేమతో మీరు పెట్టే మాంసాహారమైనా కాదనలేనేమో!" అన్నాను.

"పండిట్‌జీ! నా తృప్తికోసం మీ నియమాల్ని బలిపెడ్తానా?" అంటూ మనసారా నవ్వేరు.

ఆయన కుటుంబానికంతా రంజాన్ శుభాకాంక్షలు పంపేను.

* * *

ఊరువదిలి ఐదు నెలలైంది. ఈ నెలలోనైనా శేఖర్‌ని వప్పించి బయల్దేరాలనుకుంటున్నాను.

ఒక ఆంగ్ల వార్తా పత్రికలో ఒక వ్యాసం ప్రచురించబడింది. ఆ వ్యాసంలో కర్నాటక రాష్ట్రంలోని తింతిణి గ్రామంలో పరమత సహనానికి ప్రతీకగా నిలిచిన ఒక విశిష్టమైన ఆలయం గురించి చెప్పబడింది. ఆలయ ప్రాంగణంలో హిందువుల దైవం, ముస్లిందర్గా కలసి ఒకే చోట వున్నాయి. హిందూ, ముస్లింలిద్దరూ ఆ స్థలానికి వెళ్లి ప్రార్థనలు చేస్తుంటారు.

ఆ వ్యాసం నేను షబ్బీర్‌తో వున్నప్పుడే చదవటం జరిగింది.

"షబ్బీర్‌జీ! తింతిణి ఆలయం మీరెప్పుడైనా సందర్శించారా?" అడిగాను.

"లేదు... చూడాలనే అనుకున్నాను. ఒక హిందువుతోడు దొరికినప్పుడే వెళ్తే బాగుంటుందనుకున్నాను" అన్నారాయన నవ్వుతూ.

"నేనిప్పుడు తోడు దొరికాననే అనుకున్నా, అంతదూరం ప్రయాణం చెయ్యగలరా?"

"తప్పకుండా! ఇక్కడకు మూడు గంటలకు మించి ప్రయాణం వుండదు. మనకూ ఒక మంచి యాత్రానుభవం వుంటుంది" ఎంతో ఉత్సాహంగా అన్నారు.

ఇంటికి సలీం వస్తూనే మా కోరికను అతనికి చెప్పారు. అతను సంతోషంగా ప్రయాణానికి తగిన ఏర్పాట్లు చేస్తానన్నాడు.

అన్నట్లుగానే సలీం మా ప్రయాణానికి మూడోరోజుకల్లా ఏర్పాట్లు చేయించాడు. ఉదయం ఏడు గంటలకు ముందే సరంజామాతో కారులో బయల్దేరాం. సహాయంగా జబ్బార్ వున్నాడు.

"పండిట్‌జీ! నేనూ హిందువునే!" కారులో వెళ్తుండగా హఠాత్తుగా అన్నారు.

"అదెట్లా! మీరు కాస్త వివరించి చెప్పండి!" ఆసక్తిగా అడిగాను.

"నిజం పండిట్‌జీ! మా పూర్వీకులు కర్నాటకలో వుండేవారు. ఇరవై తరాలకు పూర్వం వాళ్లంతా హిందువులే. అయితే అప్పటి ముస్లిం పాలకుల ప్రభావంచేత ఇస్లాం మతం స్వీకరించి వుంటారు. కొన్ని తరాలు గడిచాక బతుకు తెరువు కోసం ఈ ప్రాంతానికి

వలస వచ్చి వుండొచ్చు. బహుశా ఈ ప్రాంతం ముస్లిం పాలకుల ఏలుబడిలో వుండటంవలన రావటం జరిగివుంటుంది. నిరూపణకు అవసరమైన డాక్యుమెంట్లు నేను చూపించగలను" చెప్పారాయన.

ఆయన మాటల్లోని నిజాయితీ నన్ను ముగ్ధుణ్ణి చేసింది.

"అక్కర్లేదు. మీ మాటలమీద నాకా విశ్వాసం వుంది" అన్నాను.

"వాస్తవం చెప్పాలంటే ఈ దేశంలో ముస్లింలని పిలువబడే వాళ్లు అధికంగా ఇలాంటివాళ్లే కావచ్చు. ఇక్కడి క్రైస్తవులూ అంతే! ఈ గడ్డమీద పుట్టి, ఈ గాలి పీలుస్తూ, ఈ గడ్డమీదనే పెరుగుతూ నా దేశం కాదని ఎలా అనుకోగలం? మనం వివిధ మతస్థులం అనుకోవటం కన్నా ఒకే దేశస్థులం అనుకోవటాన్ని మించిన ఆనందం ఏముంటుంది?" అన్నారు.

"నిజమే! సామాన్య ప్రజల్లో ఆ చైతన్యం తీసుకురావటం చాలా అవసరం. ఒకరినొకరు అనుమానిస్తూ సహజీవనం ఎలా సాధ్యం? రెండు వర్గాల మధ్య వైషమ్యాలను పెంచి పోషిస్తూ తమ పబ్బ గడుపుకునే మత పెద్దల్నీ, రాజకీయ నాయకుల్నీ దూరంగా తరిమికొడితేనే శాంతి ఏర్పడుతుంది".

కబుర్లతో కాలం ఇట్టే గడిచినట్లనిపించింది. ఏ ఇబ్బంది లేకుండా మూడు గంటల ప్రయాణంతో తింతిణి చేరుకున్నాం.

ఆవరణంతా కలియదిరిగాం. సరైన పోషణ లేక ప్రహరీ శిథిలమవుతోంది. అక్కడక్కడ ఇటుకలు, రాళ్లు పడివున్నాయి.

కట్టడంలో డోమ్‌లాగ ఒక ఆకారం వుంది. దానికి గంటలు వేలాడుతున్నాయి. ఆ క్రింది భాగంలో హిందూ దేవుళ్ల విగ్రహాలు, బొమ్మలు వున్నాయి. పసుపుకుంకుమల్లాంటి పూజా సామాగ్రి వుంది. డోమ్‌ని ఆనుకునే ప్రక్కగా మెట్లున్నాయి. ఆ మెట్లమీదుగా వెళ్తే ఎదురుగా దర్గావుంది.

ఆలయ సందర్శన అయ్యాక ఆ ఆవరణలోనే నీడగా వున్నచోట జబ్బార్‌చేత జంపఖానాలు వేయించి కూర్చున్నాం. ఆయనా, నేను తయారు చేయించి తెచ్చిన తినుబండారాలు దండిగానే పోగయ్యాయి.

ఆ ప్రాంగణంలో అటూ ఇటూ తిరుగుతున్న వాళ్లు మాకేసి ఆసక్తిగా చూస్తున్నారు. వాళ్ల ముఖాల్లో ఆశ్చర్యం తొంగి చూస్తోంది. ఒక హిందువు, ముస్లిం కలిసి రావటం అందుకు కారణం కావచ్చనుకున్నాను.

"హిందువులు ట్రస్టీలుగా మా ప్రాంతంలో కూడా కొన్ని దర్గాలున్నాయి. హిందూ, ముస్లింలిద్దరూ వస్తారు. పూజలు చేస్తారు. సంతానంలేని హిందూ దంపతులు సంతానం కోసం ప్రార్థనలు చేసి మొక్కుతుంటారు. పుట్టిన బిడ్డలకు హుస్సేన్ రావనో, మస్తానయ్యనో రకరకాల ముస్లిం పేర్లు పెట్టుకుంటారు" వివరంగా చెప్పాను.

"పండిట్‌జీ! ఆడామగా, తెలివైన వాళ్లు, తెలివి తక్కువవాళ్లు అన్న భేదాలు సృష్టిపరమైనవి. ఉన్నవాళ్లు, లేనివాళ్లు అనేది సాంఘికపరమైన వ్యత్యాసం. అది తొలగించబడాలన్న ప్రధానమైన సమస్య ఒకటివుండగా ఇంకా కులం, మతం అంటూ కొత్త సమస్యల్ని పెంచుకోవటం అవివేకం అవుతుంది" ఆవేదనగా అన్నారాయన.

ఆసక్తిగా మా చుట్టూ చేరిన గ్రామస్థులు కాస్సేపట్లోనే మాకు సన్నిహితులయ్యారు. ఆ గ్రామం గురించి, ఆలయం గురించి ఎన్నో విషయాలు చెప్పారు. మధ్యాహ్నం లంచ్ కోసం తెచ్చిన స్వీట్లు, పులిహోర, గారెలు ఇంకా రకరకాల వంటకాలు ఎవరి ఇష్టానికి తగ్గట్లు వాళ్లం వడ్డించుకుని అందరం తిన్నాం.

మూడు గంటల తర్వాత తిరుగు ప్రయాణమయ్యాం. సరంజామా కారులోకి జేర్చటానికి గ్రామస్థులూ సాయపడ్డారు. సాయంత్రం ఆరున్నరకల్లా జహీరాబాద్ చేరుకున్నాం.

తింతిణి వెళ్లొచ్చిన వారం రోజుల తర్వాత షబ్బీర్‌తో నా ప్రయాణం గురించి ప్రస్తావించాను.

"నేను రెండు మూడు రోజుల్లో వెళ్తాను. వెళ్లేలోపు తిరిగి మిమ్మల్ని కలవలేక పోవచ్చు" చెప్పాను.

ఆయన ముఖంలో నీలినీడలు కమ్ముకున్నాయి. కొద్దినిమిషాలు మౌనంగా వుండిపోయారు.

"పండిట్‌జీ! ఆకాశం విశాలమైంది. గుంపులు గుంపులుగా పక్షులు కలిసిమెలిసి తిరుగాడుతుంటాయి. సాయంత్రానికల్లా దేని గూటికది చేరాల్సిందేకదా!" అన్నారు తేలిగ్గా నవ్వటానికి ప్రయత్నిస్తూ.

ఇంట్లో అందరి దగ్గరా సెలవు తీసుకున్నాను. నాతోపాటు వీధి గుమ్మందాకా నడిచి వచ్చారు. "పండిట్‌జీ! అప్పుడప్పుడు వస్తుంటారుగా?"

"తప్పకుండా! అబ్బాయి ఇల్లు కట్టుకుని ఈ ఊరివాడు అయ్యాక నేనూ ఈ ఊరి వాణ్ణేగా!" అన్నాను మందహాసంగా!

"మీరు ఇక్కడ వున్నప్పుడు గనుక నేను చనిపోవటం జరిగితే నా అంతిమయాత్రలో మీరూ పాల్గొనాలి. నా ఈ చిన్న కోరిక మన్నిస్తారా?" నా చేతుల్ని ఆయన చేతులు ఆప్యాయంగా పెనవేసుకున్నాయి. ఆయన కళ్లలో నీరు పొంగుకొస్తోంది.

ఆయన చూపిస్తున్న ప్రేమకు నా గుండె బరువెక్కింది. గొంతు పూడుకు పోయినట్లనిపించింది.

ఎలాగో గొంతు పెగల్చుకుని, "షబ్బీర్‌జీ! అది నా భాగ్యం అనుకుంటాను. తప్పకుండా మీ కోరిక తీరుస్తాను" అంటూ భారంగా ముందుకు అడుగేసేను.

వీధి మలుపు తిరుగుతూ వెనుదిరిగి చూసేను. అలానే వీధి గుమ్మంలో నిలబడి నాకేసి తదేకంగా చూస్తూ కనిపించారు. వీధి మలుపు తిరగ్గానే కర్చీఫ్‌తో కళ్లు వత్తుకున్నాను.

* * *

ఉదయం తొమ్మిది గంటలవుతుంది.

అప్పుడే నేను బ్రేక్‌ఫాస్ట్ ముగించి వార్తాపత్రిక ముందేసుకుని కూర్చున్నాను.

శేఖర్ ఆఫీసుకు వెళ్తూ, "నాన్నగారూ! రేపటి బస్‌కే మీకూ, అమ్మకూ టిక్కట్లు బుక్ చేశాను" చెప్పాడు.

శేఖర్ అటు వెళ్లాడో లేదో ఇంటిముందు కారాగిన శబ్దం. కారుదిగి డాక్టర్ సలీం దిగాలుగా రావటం నాకు కనిపించింది. గుండె వేగం హెచ్చింది.

"పండిట్‌జీ! బాబా చనిపోయారు" విచారంగా చెప్పాడు.

ఆ మాటలకు ఒక్కసారిగా షాక్ తిన్నట్లయింది. విన్నది వాస్తవమేనా అనిపించింది. కొద్ది క్షణాలు నా గొంతు పెగల్లేదు.

"అంత ప్రాణం మీదకు వచ్చే అనారోగ్యం ఏమీ లేదుగా?" ఆశ్చర్యంగా అడిగాను.

"మాసివ్ హార్ట్ ఎటాక్ అయి వుండొచ్చు" అంటూ వివరాలు చెప్పాడు.

సాధారణంగా ఆరు గంటలలోపే లేచి కాలకృత్యాలు తీర్చుకుంటారు. అలాంటిది లేవకపోతే, రాత్రి సరిగా నిద్రపట్టక లేవలేదేమోనని డిస్టర్బ్ చెయ్యటం ఇష్టం లేక ఆయన గదికేసి వెళ్లలేదు. ఎనిమిది గంటలకు హాస్పిటల్‌కు వెళ్తూ, ఏమన్నా సుస్తీగా వుందేమో చూద్దామని వెళ్లేసరికి, అప్పటికే ప్రాణం పోయింది.

ఈ కబురు ఇంకా చెప్పవలసిన వారి కోసం సలీం హడావుడిగా వెళ్లిపోయాడు. నేను విషయం ఇంట్లో చెప్పి బయల్దేరాను.

నేను వెళ్లేసరికే, ఆయన మరణ వార్త తెలిసిన బంధుమిత్రులు చూడటం కోసం పోగవుతూ ఉన్నారు. హాల్లోనే ఆయన భౌతిక కాయం దర్శనం కోసం వుంచారు. షబ్బీర్ కళ్లు మూసుకుని ప్రశాంతంగా నిద్రపోతున్నట్లే వున్నారు.

ఇంటి ముందు గుంపులు గుంపులుగా చేరుతున్న జనం షబ్బీర్ మంచితనం గురించే చర్చిస్తున్నారు. ఊరి బాగు కోసం చేసినవి ముఖ్యంగా స్మరిస్తున్నారు.

దాదాపు రెండు దశాబ్దాల క్రితం జరిగిన సంఘటన.

హిందూ, ముస్లిం ఘర్షణలు జహీరాబాద్ వరకు వచ్చాయి.

ఆయుధాలు ధరించిన రెండు వర్గాలూ ఏ క్షణానయినా ఉద్రేకంతో ఒకరినొకరు చంపుకునేలా పరిస్థితి విషమించింది. ఇరుపక్షాల మత పెద్దలకు ఘర్షణ నివారించే ధైర్యం లేకుండాపోయింది.

అప్పుడు షబ్బీర్ నిర్భయంగా ముందుకొచ్చారు.

"మతంపట్ల విశ్వాసంతో పొందిన భగవదనుగ్రహం వలన చచ్చిన చీమకు ప్రాణం పొయ్యగలరా? అలా చేసిన హిందువైనా, ముస్లిమైనా వచ్చి ముందు నన్ను చంపండి" అంటూ తన చేతిలో ప్రాణం లేకుండా వున్న నల్లచీమను చూపేరు.

ఆయన మాటలకు అంతా నిర్ఘాంతపోయారు.

"భగవంతుడు ఇలా మానవజన్మ ఇచ్చింది విచక్షణ మరిచి జంతువుల్లా తలపడటానికేనా? పరాయి మతస్థుల ప్రాణాలెన్ని తీశారన్న దాన్ని బట్టే ఆ మతం గొప్పతనం గుర్తించబడుతుందా? మతం మనకు బోధించిన మంచిని వదిలి, చెడుని అనుసరించటం మతంపట్ల మన విశ్వాసాన్ని, విధేయతను ప్రకటిస్తుందా? ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పిన తర్వాత తలపడండి" అంటూ రెండు మతాల వారినీ నిలదీసేరు.

మౌనంగా ఎటువాళ్లటు వెళ్లిపోయారు!

"పండిట్‌జీ! ఇతర ఊర్లనుండి రావాల్సిన బంధువులున్నారు. దఫ్‌నానా సాయంత్రం జరుగుతుంది" చెప్పాడు సలీం.

అప్పుడు షబ్బీర్ కడసారి కోరిక గురించి అతనికి చెప్పాను. ఆ మాటలకు సలీం కళ్లు చెమ్మగిల్లాయి.

"మీరు ఇంటికివెళ్లి విశ్రాంతి తీసుకోండి. నాలుగింటికి నేను కారు పంపుతాను".

"వద్దు... ఈ పరిస్థితుల్లో నా గురించి ఎలాంటి శ్రమా తీసుకోవద్దు. నేను వెళ్లిరాగలను" అంటూ ఇంటికి బయల్దేరాను.

ఇంటికి వెళ్లానన్న మాటేగానీ మనసంతా షబ్బీర్ చుట్టూ పరిభ్రమిస్తోంది. గత స్మృతులు బాధిస్తున్నాయి. భోజనం చెయ్యాలనిపించలేదు. విశ్రాంతిగా కాసేపు నడుం వాల్చి నాలుగు గంటలవుతుండగా బయల్దేరాను. జబ్బార్ కారుతో వచ్చాడు.

నేను వెళ్లేసరికి ముతవల్లి వేడినీళ్లతో శవానికి స్నానం చేయిస్తున్నాడు. స్నానం అయ్యాక గంధం పొడరు, ఇతర సుగంధద్రవ్యాలు చల్లి శవాన్ని కఫన్‌తో కప్పారు. చివరకు ఈత చాపలో మృతదేహాన్ని చుట్టి జనాజలో పెట్టేరు.

జనాజను నలుగురు తమ భుజాలమీదకు ఎత్తుకున్నారు. వారిలో సలీం వున్నాడు. శవయాత్ర ముందుకు సాగింది. జనాజవెంట సలీంతో పాటు నేనూ నడుస్తున్నాను.

ఆ యాత్రలో కేవలం ముస్లిములే కాదు, ఎందరో హిందువులూ ఆయన పట్ల గౌరవంతో పాల్గొన్నారు.

"పండిట్‌జీ!" మెల్లగా పిలిచాడు సలీం, జనాజ కోసం నేను అందుకునే వీలు కల్పిస్తూ. క్షణాల్లో జనాజ నా కుడి భుజం మీద మోపైంది. నా భుజాల మీదున్న ఆ బరువు నాకు భారంగా అనిపించటం లేదు. ఒక మృతకళేబరం మోస్తున్నట్లు లేదు.

కులమతాలకు అతీతమైన మానవతా సందేశాన్ని అందరం కలిసి మా భుజస్కంధాల మీద మోస్తున్న పవిత్రభావం నన్ను ఆవరించింది. నలుగురూ కలిసికట్టుగా వేస్తున్న అడుగులు అభ్యుదయం వైపు సాగుతున్నట్లుగా ఉత్తేజం కలిగింది. ప్రజలంతా నలువైపులా తమ భుజాల్ని ఇలా పట్టినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమన్న సత్యం నా కళ్లముందు గోచరించింది.

"ఏదీ, నన్నూ భుజం పట్టనివ్వండి" మరొక హిందువు అభ్యర్థన.

జనాజ నా భుజం నుండి మరొక హిందువు భుజం మీదకు మారింది. తిరిగి అది మరో ముస్లిం భుజం మీదకు మారింది. అలా భుజాలు మారుతూ ముందుకు సాగిపోతూనే వుంది.

*(విపుల, ఫిబ్రవరి 1996)*